
సాక్షి
పెద్దపల్లి

సోమవారం, 9, అక్టోబర్, 2023



నిండుకుండలా ఎల్లంపల్లి

రామగుండం: ఎల్లంపల్లి పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ఆదివారం 20.09 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 3,833 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు.



శరణు శరణు మల్లన్న

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారికి పట్నం, బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఈవో సదయ్య పర్యవేక్షించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/23.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.

నల్లా బిల్లు.. అప్‌డేట్ నిల్లు



ఇబ్రహీం గత నెల వరకు చెల్లించిన బిల్లు రశీదు



చార్జీలు చెల్లించినా ఆన్‌లైన్‌లో బకాయిలు ఉన్నట్లు చూపుతున్న కాపీ

'గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎండీ ఇబ్రహీం 2013లో నల్లా కనెక్షన్ తీసుకున్నాడు. కనెక్షన్‌కు కేటాయించిన 1104011572 నంబర్‌పై 2013 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు బిల్లులు చెల్లించి రశీదులు తీసుకున్నాడు. కాగా ఆన్‌లైన్‌లో మాత్రం 2017 నుంచి 2024 మార్చి వరకు రూ.8,400 చార్జీలు బకాయి ఉన్నట్లు చూపిస్తోంది. దీంతో అనుమానం వచ్చిన ఇబ్రహీం నగరపాలక సంస్థలో గత నెల 21న ఫిర్యాదు చేశాడు. తాను చెల్లించిన బిల్లులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. కానీ ఇప్పటి వరకు అతను చెల్లించిన బిల్స్ మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు'.



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

- నల్లా బిల్లులు చెల్లించినా ఆన్‌లైన్‌లో నమోదు కాని వైనం
- రామగుండం బల్దియాలో మ్యానువల్‌గా రశీదులు ఇస్తున్న బిల్‌కలెక్టర్లు
- ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంపై బాధితుల ఆగ్రహం

కోల్‌సిటీ(రామగుండం): తాగునీటి నల్లా కనెక్షన్‌కు సంబంధించి వినియోగదారులు ప్రతినెలా బిల్లులు చెల్లించి రశీదు తీసుకుంటున్నా ఆన్‌లైన్‌లో మాత్రం బకాయి ఉన్నట్లు చూపిస్తోంది. ఇది ఒక్క రామగుండంలోనే సమస్య కాదు.. జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో కూడా ఇదే పరిస్థితి. బిల్‌కలెక్టర్లు మ్యాన్యువల్ రశీదులు ఇచ్చి చార్జీలు తీసుకుంటున్నారు. అనంతరం బిల్లులు చెల్లించిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. ఆన్‌లైన్‌లో వేలాది రూపాయలు బకాయి ఉన్నట్లు చూపిస్తుండడంతో బిల్లులు చెల్లించిన వారంతా ఆందోళనతో ఫిర్యాదులు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులు లాగిన్‌ఐడీ, పాస్‌వర్డ్ సాకర్యం కల్పించకపోవడమే కారణమని అధికారులు వెల్లడిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్లు స్వయంగా సీడీఎంఏకు లేఖలు రాస్తున్నా ఉన్నతాధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదు.

నాలుగు మున్సిపాలిటీల్లో ఇదే నిర్లక్ష్యం

జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల్లో వినియోగదారులు నల్లా కనెక్షన్ చార్జీలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంటి పన్ను మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు, నల్లా కనెక్షన్ చార్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం ద్వారా అక్రమాలు జరిగేందుకు ఆస్కారముంది. నల్లా కనెక్షన్ల ద్వారా రూ.కోట్లాది ఆదాయం వస్తున్నా ఉన్నతాధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీడీఎంఏకు లేఖలు

నల్లా చార్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు లింక్, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ పంపించాలని రామగుండం నగరపాలక సంస్థ అధికారులు అనేక సార్లు రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులకు లేఖలు పంపించారు. అయినా సీడీఎంఏ నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదు. 2020 జూన్‌లో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ కూడా ఆన్‌లైన్ నమోదుకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇవ్వాలని, వీటి నిర్వహణకు కేటాయించిన ఇద్దరు ఉద్యోగుల వివరాలతో లేఖ రాశారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. ఇటీవల ఇబ్రహీం అనే బాధితుడి ఫిర్యాదుతో ఈనెల 4న ప్రస్తుత కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ కూడా సీడీఎంఏకు లేఖ పంపించారు.

సీడీఎంఏకు లేఖ రాశాం



నల్లా బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయించడానికి సీడీఎంఏకు లేఖ రాశాం. ఇబ్రహీం అనే వ్యక్తి చెల్లించిన బిల్లులను అప్‌డేట్ చేయడానికి సీజీజీ వెబ్‌సైట్ లింక్‌ను పంపించాలని కోరాం. ఉన్నతాధికారులతో చర్చించి, సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – సీహెచ్.నాగేశ్వర్, మున్సిపల్ కమిషనర్, రామగుండం

రామగుండం బల్దియాలో..

మొత్తం నల్లా కనెక్షన్లు	39,724
వాటర్ చార్జీల డిమాండ్	రూ.9.71 కోట్లు
మొత్తం వాటర్ ట్యాంక్‌లు	12
రోజూ వాటర్ సరఫరా	40ఎంఎల్‌డీ

ఖాళీ పోస్టులకు రేపు ఇంటర్వ్యూలు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమాకాంత్ తెలిపారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు 9, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) 1 పోస్టుకు ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి, అర్హతగల వారు నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు దరఖాస్తుతో పాటు పూర్తి బయోడేటా, అన్ని ఒరిజినల్, ఒక సెట్ జిరాక్సు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 95731 41615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు లబ్ధి



శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మహిళలు

కమాన్‌పూర్(మంథని): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలతో లబ్ధి జరుగుతుందని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని కిష్టంపల్లెకు చెందిన మహిళలు, రైతులు, యువకులు భారీ సంఖ్యలో ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అక్కడ ప్రవేశపెట్టిన పథకాలు ఏవిధంగా అమలు జరుగుతున్నాయో వాటిని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, సర్పంచులు ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, నాయకులు రంగు సత్యనారాయణ, గుమ్మడి సతీశ్, శ్రీనివాస్, పిడుగు శంకర్, అన్వర్, గాండ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దీపావళి బోనస్ రూ.85,000



గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికులకు పీఎల్‌ఆర్ బోనస్ (దీపావళి బోనస్) పెంపుదలకు సంబంధించిన చర్చలు న్యూఢిల్లీలో జరిగాయి. కోల్‌ఇండియా యాజమాన్యంతో జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఆదివారం సమావేశంలో చర్చించారు. పీఎల్‌ఆర్ బోనస్ రూ.1,20,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం రూ.85,000 చెల్లించేందుకు అంగీకరించింది. కాగా గతేడాది రూ.76,500 బోనస్ చెల్లించారు. అయితే సమావేశం జరుగుతున్న సమయంలో కార్మిక సంఘాల నాయకుల మొబైల్ ఫోన్లను యాజమాన్యం స్వాధీనం చేసుకోవడం దుర్మార్గపు చర్య అని నాయకులు ఆరోపించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికై నట్లు జిల్లా యోగా అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాస్టర్ మల్లయ్య తెలిపారు. ఆదివారం ఎన్టీపీసీలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొనగా రాష్ట్ర స్థాయికి రిషిత, లక్ష్మీప్రసన్న, హరిణి, తేజస్విని, వరుణ్, అక్షయ, శివమారుతి, అరుణ్‌కుమార్, నిఖిల్, సాయిప్రసన్న, సాహిత్, శ్రీరామ్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు స్వరూప, సత్యనారాయణ, తన్వీర్ సుల్తానాలు అభినందించారు.

ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు వేయించాలి

పెద్దపల్లిరూరల్: ఐదేళ్లలోపు పిల్లలకు ప్రతీ టీకా వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం మూడో దశ సోమవారం నుంచి ఈనెల14 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు వ్యాధి నిరోధక టీకాలు తీసుకోకుంటే వారందరికీ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా టీకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, ఇమ్యునైజేషన్ సెంటర్లలో టీకాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందు కోసం 187 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల లోపు పిల్లలు టీకాలు తీసుకోకుండా 483 మంది, అలాగే 140 మంది గర్భిణులు ఉన్నట్లు సర్వే ద్వారా గుర్తించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో కోరారు.

'కొంకటి'కి సన్మానం



సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గోదావరిఖని(రామగుండం): రామగుండం కార్పొరేషన్ తొలి మేయర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులైన కొంకటి లక్ష్మీనారాయణను ఆదివారం సన్మానించారు. గోదావరిఖనిలోని లక్ష్మీనారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు మోహిద్ సన్నీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సభలో ఆయనను సన్మానించారు.

నేడు ఓదెల మల్లన్న పాలకవర్గ ప్రమాణస్వీకారం

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి ఆయన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఉదయం 9 గంటలకు జరగనుందని ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో ప్రభుత్వం ప్రకటించిన పాలకవర్గసభ్యులు, చైర్మన్ ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కల్లు, మోకుతో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మాయమాటలు చెప్పే కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం కనుకుల, రామునిపల్లి, మియ్యాపూర్ గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే ఇంటింటా తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి మూడోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని మండలంలోని కనుకులలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి చుక్కెదురైంది. కనుకులలో కొందరు మహిళలు డబుల్‌బెడ్రూం, గృహలక్ష్మి పథకాలు ఉన్నవారికే కేటాయించడం ఏంటి అని నిలదీశారు. అయితే స్థానిక నాయకులు మహిళలకు నచ్చజెప్పారు.

ప్రజల కోసమే పాదయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

గోదావరిఖని(రామగుండం): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆరోపించారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ 30, 10వ డివిజన్‌లలో మూడో రోజు ప్రజాదీవెన యాత్రలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి పాలనను ముగింపుచేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు ప్రకటించాలని ప్రజలను కోరారు. ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను రూపొందించడం జరిగిందని వెల్లడించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతీ గృహిణికి నెలకు రూ.2,500 చొప్పున పెన్షన్, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ, రూ.2 లక్షల రైతు రుణమాఫీ, విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం, తదితర పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా ప్రభుత్వం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



వ్యాపార సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్(రామగుండం): మహిళల ఆర్థికాభివృద్ధికి, చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో మహిళా స్వశక్తి భవనం, సండే మార్కెట్‌లో వస్త్ర మూట వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. స్వశక్తి సంఘాలకు ప్రతి డివిజన్‌లో భవనాల నిర్మాణాలకు కృషి చేస్తున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, కల్వచర్ల కృష్ణవేణి, కుమ్మరి శ్రీనివాస్, మహిళ సంఘం నాయకురాలు నూనె లత మోహన్, నాయకులు బుర్ర శంకర్‌గౌడ్, కొలిపాక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ శివారులో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ పక్కా భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే చందర్ శంకుస్థాపన చేశారు. వీటితో పాటు విలేజి అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం, పెద్దంపేటలో 60ఏళ్ల క్రితం నాటి కుర్షుకమ్మి భూపట్టాలను రైతులకు అందజేశారు. కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఏరియాలో డ్రైనేజీ నిర్మాణ పనులు, కబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు తిరుపతినాయక్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, ఇసంపెల్లి తిరుపతి, ఉప్పరి లక్ష్మణ్, పెద్దంపేట, విలేజి అంతర్గాం గ్రామాల సర్పంచులు మేర్గు భాగ్యమ్మ, సతీశ్, ఎంపీటీసీ కొలిపాక శరణ్య పాల్గొన్నారు.

'ఖని'లో శౌర్య జాగరణ శోభాయాత్ర



శోభాయాత్రలో నాయకులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): విశ్వహిందు పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ ప్రధాన చౌరస్తా నుంచి శౌర్య జాగరణ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శివాజీనగర్, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, రాజస్తాన్ భవన్ వరకు శోభాయాత్ర కొనసాగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ, దేశంలో ఉగ్రవాదం, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పేరుతో హిందు సమాజంపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. హిందు సమాజంలోని ప్రతి ఒక్కరూ సైనికుడిలా దేశ, సంఘ వ్యతిరేక శక్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ముదుపు యాదిరెడ్డి, జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ముష్క సంపత్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మూడం సురేందర్, నగర కార్యదర్శి మేడగోని రవీందర్, నాయకులు గిరిదరిలాల్ రాఠి, కొండపర్తి లింగన్న, గోషిక శ్రీనివాస్, మునుకుంట్ల శ్రీనివాస్, అడిగొప్పుల రాజు, శివ, సట్టపల్లి అనిరుద్, దేవి లక్ష్మయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



కొలనూర్‌లో మాట్లాడుతున్న విజయరమణారావు

ఓదెల(పెద్దపల్లి): కన్నతల్లిలాంటి కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. ఓదెల మండలం కొలనూర్‌లో ఆదివారం రాత్రి గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో పేద ప్రజలకు జరిగిందేమీ లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ జెడ్పీటీసీ మినపాల ప్రకాశ్‌రావు, సీనియర్ నాయకులు బైరి రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పర్శ రమేశ్, మాజీ సర్పంచ్ బొంగోని రాజయ్యగౌడ్, జిల్లా నాయకులు చీకట్ల మొండయ్య, నాయకులు దేవిడి శ్యాంరెడ్డి, దొడ్డె స్వామి, చొప్పరి రాజయ్య, బైరి సంతు, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

పెద్దపల్లిరూరల్: బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా డీఎస్సీ, ఎస్జీటీ టీచర్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి తెలిపారు. ఈనెల 12 లోగా అర్హతగలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఆన్లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని, 100 మందికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీసీలకు 75, ఎస్సీ 15, ఎస్టీ 5, ఈబీసీలకు 5 శాతం అవకాశం ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 0878– 2268686 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి


రాజయ్య(ఫైల్)

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. గ్రామానికి చెందిన కర్నె రాజయ్య (60) బస్టాండ్ నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. రేకొండ నుంచి బొమ్మనపల్లి బస్టాండ్ వైపు కర్రలోడుతో వస్తున్న ట్రాక్టర్ గ్రామ పంచాయతీ సమీపంలో వెనక నుంచి ఢీకొట్టింది. రాజయ్య తలపగిలి మెదడ బయటకు వచ్చింది. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడు. చిగురుమామిడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజయ్యకు భార్య కనుకవ్వ, ఇద్దరు కొడుకులు లక్ష్మణ్, ఆంజనేయులు, కూతురు ఉంది.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

మానకొండూర్: మానకొండూర్‌లో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు కారును ఢీకొనడంతో ఒకరికి గాయాలు అయ్యాయి. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన ఐదుగురు మానకొండూ ర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో జరిగిన ఓ శు భకార్యానికి ఆదివారం హాజరయ్యారు. తిరిగి వెళ్తుండగా మానకొండూర్ మండలకేంద్రంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న మల్లమ్మ(65)కు గాయాలు అయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

అక్రమ అడ్మిషన్లపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలు, కళాశాలల్లో ముస్లిం విద్యార్థులకు కేటాయించే సీట్లలో బాప్టిజం సర్టిఫికెట్ల ముసుగులో జరిగిన అక్రమ అడ్మిషన్ల అవకతవకలపై జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండల పరిధిలోని స్కూళ్లతో పాటు ఉమ్మడి జిల్లా స్కూళ్లకు చెందిన ప్రిన్సిపాళ్లు, కొందరు నాన్ టీచింగ్ సిబ్బంది కలిసి వేలాది రూపాయలు వసూలు చేస్తూ అక్రమంగా అడ్మిషన్లు ఇస్తూ.. అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏడాదికి 150 నుంచి 200మంది నాన్ క్రిస్టియన్లను కేవలం మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్లు ఇప్పించే లక్ష్యంగా పెట్టుకున్న, ఈ అక్రమార్కులు ఏడాదికి కోటిన్నర రూపాయలను దొడ్డిదారిన ఆర్జిస్తున్నారని తెలిపారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ, దర్యాప్తు జరిపించి బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో కుమారుడి మరణాన్ని తట్టుకోలేని తండ్రి మానసిక వేదనకు గురై చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. మండలంలోని మొర్రాపూర్ తండాకు చెందిన భూక్య బీమానాయక్(60) ఆదివారం గ్రామ శివారులోని తన పొలంలో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న బీమానాయక్‌ను కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బీమానాయక్ పెద్ద కుమారుడు శ్రీనివాస్‌నాయక్ రెండేళ్ల క్రితం దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య సుందరి పక్షవాతంతో బాధపడుతోంది. అప్పటి నుంచి బీమానాయక్ మానసికంగా కుంగిపోయి, పిచ్చిగా ప్రవర్తించేవాడు. కొడుకు చనిపోయాడనే వేదనతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు జగన్ నాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తేలనున్న తాటి, ఈతవనం లెక్క

- త్వరలో సర్వే చేపట్టేందుకు సన్నద్ధం


తాటి చెట్ల వనం

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఈత, తాటివనం లెక్క తేల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గీత కార్మికుల జీవనాధారమైన తాటి, ఈతచెట్లను మొగిపురుగు ఆశిస్తోంది. ఏటా వాటిసంఖ్య తగ్గిపోతోంది. అయితే, గీత కార్మికులకు ఉపాధి మెరుగుపర్చేందుకు హరితహారం ద్వారా వేలసంఖ్యలో మొక్కలు నాటాలని ప్రభుత్వం గీతకార్మికులను ప్రోత్సహిస్తోంది. ఈమేరకు ఎక్సైజ్ అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో 207గీత పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, అందులో 8,017 మంది సభ్యులు కొనసాగుతున్నారు.

చెట్ల పరిరక్షణకు చర్యలు

తాటి, ఈత చెట్ల సర్వేను త్వరలో చేపట్టనున్నారు. ఇందులో భాగంగా తాటి, ఈత, కర్జూర చెట్లు గుర్తించి వాటికి క్రమసంఖ్య ఇస్తారు. తద్వారా వాటి పరిరక్షణ సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ఇదేసమయంలో.. చెట్లు నరికితే జరిమానతోపాటు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. అయితే, గ్రామాలు, పట్టణాల్లో చెట్లను లెక్కించి వాటిని సొసైటీలకు కేటాయించాలని గీతకార్మికులు కోరుతున్నారు. మరోవైపు.. కొత్తగా కల్లు దుకాణాలు, వృత్తిలోకి వచ్చేవారికి వెంటనే లైసెన్స్‌లు మంజూరు చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

చర్యలు తీసుకోవాలి



ఈత, తాటిచెట్లు నరికేవారిపై కఠిన వ్యవహరించాలి. తాటిచెట్లకు మొగిపురుగు ఆశించకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– పదాల అజయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ గర్రెపల్లి

ఆదేశాలు వచ్చాక..



సర్వేపై ప్రభుత్వ మార్గదర్శకాలు ఇంకా అందలేదు. ఆదేశాల ఆధారంగానే తదుపరి చర్యలు చేపడతాం. తాటి, ఈతచెట్ల సంఖ్య తేల్చేందుకు సర్వే చేస్తాం.

– మహిపాల్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

36 ఏళ్లకు.. ఆత్మీయ పలకరింపు


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986–87లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల బృందం తొలిసారిగా 36 ఏళ్ల తర్వాత పరస్పర ఆత్మీయ పలకరింపునకు ఆదివారం ముహూర్తం కుదిరింది. తోటి మిత్రులను చూడగానే కళ్ల నుంచి ఆనందభాష్పాలు కారుస్తూ ఆలింగనం చేసుకుంటూ నాటి ముచ్చట్లను 120 మంది మిత్రులు నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు 8 సీసీ కెమెరాలు, ఇంటర్‌నెట్‌ను పూర్వపు ఉపాధ్యాయుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. అనంతరం వారిని సత్కరించారు. తమ నుంచి దూరమైన ఉపాధ్యాయులు, విద్యార్థుల పేర్లను గుర్తు చేసుకొని మౌనం పాటించారు. లక్ష్మీనారాయణ అనే మిత్రుడు లేకపోవడంతో అతని సతీమణిని పిలిపించి ఓదార్చారు. ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఒకరికి ఒకరు కనిపించనంత దూరం వరకు టాటా చెబుతూ బరువైన గుండెలతో ఇంటి దారి పట్టారు.

వెలకట్టలేనిది



నా బాల్యమిత్రులతో గడిపిన క్షణాలు వెలకట్టలేనిది. 36 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులతో కలిసి ఎంజాయ్ చేస్తామని కలలో కూడా అనుకోలేదు. ఈ రోజు గురువుల రుణం తీర్చుకున్నట్లయింది.

– డాక్టర్ ప్రియదర్శిని, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏటూరు నాగారం

మనోధైర్యం వచ్చింది



తొలిసారి బాల్యమిత్రులను కలుసుకోవడం అదృష్టం. సమస్యలు ఎన్ని ఉన్నా బాల్యమిత్రులతో గడిపిన మధుర క్షణాలతో గుండె నిండా మనోధైర్యం వచ్చింది. నేను పుట్టిన ఊరు, తిరి గిన కాలనీ, చదివిన పాఠశాలను చూశాకా మన సు నిండిపోయింది.

– రావుల శైలజ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లక్షెట్టిపేట

ఏడాదికోసారి..



అరేయ్ అంటూ పిలిచే వారు కేవలం బాల్యమిత్రులు తప్ప జీవితంలో ఎవరి నుంచి ఈ పిలుపు వినడం ఉండదనే విషయం తెలిసిందే. ప్రతీ ఏడాదికి ఒకసారి బాల్యమిత్రులను కలుసుకునేందుకు ప్లాన్ చేసుకుంటున్నాం.

– ముస్త్యాల రమేశ్, గ్రానైట్, ఫార్మా వ్యాపారి, కరీంనగర్

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం


వృద్ధుడి మృతదేహం


రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఆదివారం జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు. పట్టాల పక్క నుంచి నడిచి వెళ్లే క్రమంలో అదుపుతప్పి ట్రాక్ సర్క్యూట్‌పై పడడంతో ఎడమ కాలు విరిగి బలమైన గాయాలతో మృతిచెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతుడి వయస్సు సుమారు 55–60 ఏళ్ల మధ్యలో ఉంటుందని, తెలుపు బనియాన్, గ్రే కలర్ లోయర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచు భర్త మృతి


తిరుపతిగౌడ్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కిష్టంపేట మాజీ సర్పంచు పల్లేర్ల వనిత భర్త తిరుపతిగౌడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తిరుపతి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, గ్రామ సర్పంచు కాసర్ల తిరుపతిరెడ్డి, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎగ్లాస్‌పూర్ శివారులో గుప్తనిధుల తవ్వకాలు?


తవ్వకాలు చేపట్టిన దృశ్యం

రామగుండం: అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామశివారు ఎనుగుల కండె గుట్ట ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కొద్ది రోజులుగా గుప్త నిధుల తవ్వకాలను చేపడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎగ్లాస్‌పూర్ నుంచి గుట్టను తవ్వి కండె గుట్ట మీదుగా పాలకుర్తి మండలంలోని పుట్నూర్‌కు రహదారి నిర్మాణం చేపట్టారు. కాగా గుట్టను చీల్చి రోడ్డు వేసే క్రమంలో శ్రీహనుమాన్, ఏనుగులు, నంది తదితర రాతి విగ్రహాలు, చారిత్రాత్మక విషయాలు వెలుగు చూశాయి. ఈ క్రమంలో చారిత్రక నేపథ్యం ఉన్నట్లు గుర్తించిన వ్యక్తులు రాత్రి వేళల్లో పలుచోట్ల గుప్తనిధుల తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిసింది. భారీగా గుంతలు తవ్వుతూ వాటిని ఇతరులు గుర్తించకుండా గుంతపైన చెట్ల మొక్కలను వేసి పెడుతున్నట్లు ఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. కాగా గుప్త నిధుల తవ్వకాలు చేపట్టే ముఠా కోసం అంతర్గాం పోలీసులు నిఘా పెట్టినట్లు తెలిసింది. దీనిపై పురావస్తుశాఖ అధికారులు స్పందించి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'ట్రినిటీ'లో వన్డే వర్క్‌షాప్


అవగాహన కల్పిస్తున్న వెంకటశివ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో 'న్యాక్ సీవోస్, పీవోస్, మ్యాపింగ్ అండ్ అటైన్మెంట్ ఆన్ అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఆదివారం వన్డే వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాక్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ వెంకటశివ న్యాక్, ఎన్బీఏ అక్రిడేషన్ పొందేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఉపాధ్యాయులకు సీవోస్ పీవోస్ మ్యాపింగ్, అటైన్మెంట్ అవుట్ కం బేసిడ్ ఎడ్యుకేషన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయులకు లేటెస్ట్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలనే ఆలోచనతో ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్య చట్టంపై అవగాహన పెరుగుతుందన్నారు. హెచ్‌వోడీలు డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ కౌసల్య, రామ్మోహన్, స్వాతి, ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

జేసీబీ దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు

కరీంనగర్‌రూరల్: జేసీబీలను సైతం క్షణాల్లో మాయం చేసే ఘరానా దొంగల ముఠాను కరీంనగర్‌రూరల్ పోలీసులు సీసీ కెమెరాల సాయంతో పట్టుకున్నారు. పట్టుకున్న జేసీబీ దొంగల వివరాలను రూరల్ ఏసీపీ తాండ్ర కరుణాకర్‌రావు ఆదివారం విలేకరుల సమావేశంలో వివరించారు. తీగలగుట్టపల్లికి చెందిన గుంజే లక్ష్మణ్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తునే బ్యాంకు రుణం ద్వారా రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. జేసీబీలు సక్రమంగా నడువక పోవడంతో బ్యాంకు కిస్తీలు కట్టలేకపోయాడు. ఒక జేసీబీని పరిచయస్తుడైన బెజ్జారం రమేశ్ ద్వారా షకీల్ అనే వ్యక్తికి విక్రయించాడు. ముగ్గురికి పరిచయం బాగా పెరిగిన క్రమంలో ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో లక్ష్మణ్ హైదరాబాద్‌కు మకాం మార్చి కారుడ్రైవర్‌గా చేరాడు. కరీంనగర్‌లో జేసీబీలను దొంగతనం చేసి హైదరాబాద్‌లో విక్రయించాలనే ఆలోచనతో తన డ్రైవర్ యాకాంబరం, మురళీలతో కలిసి లక్ష్మణ్ కొత్తపల్లి పెట్రోల్‌బంకులో ఉన్న జేసీబీని గతనెల 11న దొంగిలించేప్రయత్నం చేశాడు. యజమాని లింగమూర్తి వెంబడించడంతో విడిచిపెట్టి పారిపోయారు. మరుసటిరోజు 12న గోపాల్‌పూర్‌లో ఎర్ర రామకృష్ణకు చెందిన జేసీబీని దొంగలించి హైదరాబాద్‌కు పోయారు. గత నెల 30న కరీంనగర్‌కు వచ్చిన లక్ష్మణ్, మురళీలు ఏకాంబరంతో కలిసి తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వేల్పుల గోపాల్‌కు చెందిన జేసీబీని ఎత్తుకెళ్లారు. రమేశ్ ద్వారా షకీల్‌కు విక్రయించి కమీషన్ డబ్బులను పంచుకుంటున్నారు. జేసీబీ దొంగలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు గుంజే లక్ష్మణ్, తుర్కా మురళీ, అలకుంట ఏకాంబరం, బెజ్జారం రమేశ్, కోట్ల షకీల్‌ను అరెస్ట్ చేశారు. దొంగల నుంచి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. జేసీబీ దొంగతనం కేసును ఛేదించిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై రాజు, హెడ్‌కానిస్టేబల్ అశోక్, రమేశ్, దయానంద్‌ను ఏసీపీ అభినందించారు.

ఆటో, బైక్ ఢీ.. పలువురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్, దిలీప్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని ఇప్పలపల్లె గ్రామ శివారులో ఆదివారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మల్యాల గ్రామానికి చెందిన పేరాల దిలీప్ తన స్నేహితుడు శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై కాల్వశ్రీరాంపూర్ నుంచి మల్యాలకు వెళ్తుండగా జమ్మికుంట నుంచి కాల్వశ్రీరాంపూర్ వైపు వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో దిలీప్ కుడిచేయి, కుడి కాలు, శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గురిజాల జనార్దన్‌రెడ్డి, అతడి భార్య భాగ్యలక్ష్మి, మారెడుగొండకు చెందిన అల్లోల శ్రీనివాస్‌కు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

సర్క్యులర్ విడుదల చేయాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న టెక్నీషియన్లు, ఈపీ ఆపరేటర్లకు సంబంధించిన సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్ ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి సమస్యలపై గుర్తింపు కార్మిక సంఘం సహా అన్ని కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుపై యాజమాన్యం స్పందించి కార్మిక సంఘాలతో తేదీ 19–4–2022న జరిపిన చర్చల్లో మైనింగ్ సిబ్బంది, టెక్నికల్ సూపర్‌వైజర్లు, ఫోర్‌మెన్లు, టెక్నీషియన్స్, ఈపీ ఆపరేటర్స్ మెడికల్ అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వడానికి ఒప్పందం జరిగిందన్నారు. కాగా యాజమాన్యం మైనింగ్ సిబ్బంది, టెక్నికల్ ఫోర్‌మెన్స్ సంబంధించిన సర్క్యులర్ మాత్రమే జారీ చేయడాన్ని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. గతంలో జరిగిన ఒప్పందం మేరకు టెక్నీషియన్స్, ఈపీ ఆపరేటర్లకు సంబంధించిన సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. లేకుంటే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

ఉపసంహరించుకోవాలి

రామగిరి(మంథని): ట్రేడ్స్‌మెన్, మైనింగ్‌స్టాఫ్‌ను మోసం చేసేలా ఉన్న సర్క్యులర్‌ను సింగరేణి యాజమాన్యం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి ప్రకటనలో అన్నారు. ట్రేడ్స్ మెన్, మైనింగ్‌స్టాఫ్, ఈఅండ్‌ఎం సూపర్‌వైజర్, ఈపీ ఆపరేటర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌తో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని యాజమాన్యం ఎన్నికల దృష్ట్యా గుర్తింపు సంఘంతో కలిసి హడావిడిగా సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఆ సర్క్యులర్ వల్ల కార్మికులకు నష్టం వాటిల్లే ఆవకాశం ఉన్నందున యాజమాన్యం ద్వంద్వ నీతిని వీడి సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని లేకుంటే ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్జీ–3లో సెక్యూరిటీ సిబ్బందికి రక్షణ కరువు


నాగయ్యను పరామర్శిస్తున్న నాయికులు

రామగిరి(మంథని): భూ నిర్వాసితులు అధికార బలంతోనే సింగరేణి సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడుతున్నారని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు ఆరోపించారు. శనివారం సెక్యూరిటీ సిబ్బంది నాగయ్యపై లద్నాపూర్ గ్రామ సర్పంచ్ భర్త శ్రీనివాస్, గ్రామస్తులు దాడి చేయడంతో తీవ్రగాయాలు కాగా ఆదివారం వైవీ రావు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్జీ–3 ఏరియాలో సెక్యూరిటీ సిబ్బందికి రక్షణ కరువైందని, సిబ్బందిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. భూ నిర్వాసితుల సమస్యలుంటే జీఎంతో మాట్లాడి చర్చించి పరిష్కరించుకోవాలే తప్ప సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడటం సరికాదన్నారు. సిబ్బందిపై దాడులు జరుగుతున్నా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తూ, రాజీకి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై గనుల మీద నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, జూపాక రాంచందర్, డీటీ రావు, నూనె కొమురయ్య, ఆకుల శంకరయ్య తదితరులు ఉన్నారు.

దాడి సరికాదు

ఆర్జీ–3 డివిజన్‌లోని జీఎం కార్యాలయంలో శనివారం ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది నాగయ్యపై దాడిని టీబీజీకేఎస్ తరుపున ఖండిస్తున్నామని ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య ప్రకటనలో తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా యాజమాన్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్యవైశ్య మహిళలు రాజకీయ రంగంలో రాణించాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆర్యవైశ్య మహిళలు రాజకీయ రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోలేటి రమేశ్ అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన పల్లా అపర్ణ కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భవిష్యత్‌లో మహిళలకు రిజర్వేషన్ అమలు చేసే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే ఆర్యవైశ్య మహిళలు రాజకీయాల్లో రాణించేలా తమవంతు పాత్ర సామాజిక సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్ అధ్యక్షత న జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లంకి లింగమూర్తి, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగల వెంకటనారాయణ, కొమురవెల్లి రాజేందర్, పల్లా మురళీధర్, కొమురవెల్లి భద్రయ్య, అల్లంకి సత్యనారాయణ, సముద్రాల ధర్మేందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన బర్త్ డే వేడుకలు

- ఎల్లంపల్లి ప్రాజెక్టులో యువకుడి గల్లంతు


గల్లంతైన ధర్మతేజ

రామగుండం: ఎన్టీపీసీకి చెందిన ఐదుగురు యువకులు బర్త్ డే పార్టీ కోసం సరదాగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చి మద్యంతో వేడుకలు జరుపుకోగా కొద్ది సేపట్లోనే సరదా కాస్త విషాదంగా మారింది. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎన్టీపీసీకి చెందిన ఐదుగురు యువకులు బర్త్‌డే పార్టీ పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం కారులో మద్యం బాటిళ్లతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుకున్నారు. ఐదుగురు యువకులు అధికంగా మద్యం సేవించి ప్రాజెక్టులో స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. అందులో ఎవరికీ ఈత రాదు. ముగ్గురు వ్యక్తులు ఒడ్డుకు దగ్గరగా స్నానం చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు కొంచెం దూరంగా నీటిలోకి వెళ్లి సరదాగా గంతులేస్తూ స్నానం చేస్తుండగా కనకమేడల ధర్మతేజ నీటిలో మునిగి కనిపించకుండాపోయాడు. కొంతసేపు పరిశీలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. మిగతా నలుగురు వ్యక్తులు ఒడ్డుకు చేరారు. కాగా అప్పటికే చీకటి పడడంతో మరుసటి రోజు గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.